జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 2-6-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 357 పేజీలు: 4 వెల : రూ.7



# శివ.. శివా!

* శివపూజకు వచ్చి.. పాముకాటుకు గురై..
* ఒకే ఇంట్లో ముగ్గురికి కాటేసిన పాము
* మహిళ మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
* గాఢనిద్రలో ఉండగా కాటేసిన పాము
* అమీన్ సాహెబ్ పేటలో విషాద ఛాయలు



ఇచ్ఛాపురం, జూన్ 2(వార్త): శివ పూజకు వచ్చి.. పాము కాటుకు గురైన ఘటన ఇచ్ఛాపురం లో చోటుచేసుకుంది. ఆ కుటుంబంపై పాము పగ పట్టినట్టుగానే వారంతా గాఢ నిద్రలో ఉండగా ముగ్గురిని కాటేసింది. ఆ కుటుంబంలో మహిళ మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి మూడవ వార్డు అమీన్ సాహెబ్ పేట కి చెందిన వంజరాన బొడ్డయ్య అనే వ్యక్తి ఇంటికి కవిటి మండలం శవసాన పుట్టుగ నుండి కుమార్తె కుటుంబీకులు వచ్చారు. గ్రామంలో నాలుగు రోజులుగా ఉమా సహిత చంద్రశేఖర్ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం జరుగుతోంది. పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు బంధువులు వచ్చారు. ఆదివారం రాత్రి గ్రామంలో గొల్లట కార్యక్రమంలో బొడ్డయ్య కుటుంబీకులు పాల్గొన్నారు. అనంతరం ఇంటికి వచ్చి నిద్రపోయారు. ఇంతలో ఓ పాము వచ్చి నిద్రిస్తున్న నలుగురిలో ముగ్గురికి కాటు వేసింది. తలగాన పూజ (27)కు కాటు వేసింది. ఉదయాన్నే ఆమె వాంతులు రావడంతో పాటు నోటి నుంచి నురగ రావడంతో పాముకాటుగా కుటుంబీకులు గుర్తించారు. పక్కనే ఉన్న గీత కృష్ణవేణి (17), వంజరాన జయరాము(10)లకు కూడా పాముకాట్లు ఉన్నాయి. దీంతో హుటాహుటిన బరంపురం మెడికల్ కళాశాలకు తరలించారు. అప్పటికే తలగాన కృష్ణవేణి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జయరాం, కృష్ణవేణిల పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. శివ పూజకు వస్తే పామే కాటేసిందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సుడా ఏవోగా సత్యనారాయణ

శ్రీకాకుళం, జూన్ 2(వార్త): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో (సుడా) కొత్త అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ప్రభుత్వం నియమించింది. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను ఈ పదవిలో నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల నిమిత్తంగా ఈ నియామకం చేయబడిందని, ఆయన్ను తక్షణమే విధుల్లో చేరాలని సూచించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్‌కు కమిషనర్ ఆదేశించారు.

# యోగాతో ఆరోగ్యం

* మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ * 80 అడుగుల రోడ్డులో యోగాంధ్ర * చురుగ్గా పాల్గొంటున్న నగరవాసులు



శ్రీకాకుళం, జూన్ 2 (వార్త): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతీ ఇంటికీ యోగాంధ్ర ప్రాముఖ్యత తెలియాలని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యక్రమంలో ప్రతీ ఇంటికి యోగాంధ్ర గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన ప్రతీ ఇంట్లో యోగా తప్పనిసరన్నారు. యోగా పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 80 అడుగుల రోడ్డులో ప్రతీ రోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యశాల బృందం, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల. మోహన్ పాల్గొన్నారు. ఆయుష్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ గనగళ్లపేటలో మే 3వ తేదీన నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జగదీష్, డివిఈఓ, యోగా శిక్షకులు మురళీకృష్ణ, స్వాతి, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగా జీవితంలో ఒక భాగం కావాలి: ఆర్ఐవో

యోగా జీవితంలో ఒక భాగం కావాలని ఆర్ఐఒ పి. దుర్గారావు తెలిపారు. 80 అడుగుల రహదారిలో జిల్లా వొకేషనల్ అధికారి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం సోమవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా పై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు చేయడం వలన క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుం దన్నారు. యోగా అద్భుతమైన వనరు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేమంతా భాగస్వాములై కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ విద్యకు 2వ తేదీన, 21వ తేదీన యోగా కార్యక్రమం ఉంటుందన్నారు.






## ప్లాస్టిక్‌కు గుడ్ బై చెప్పండి

* ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్, క్లాత్ బ్యాగ్‌లు వాడండి
* రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం, జూన్2(వార్త): ప్లాస్టిక్ కవర్లకు గుడ్ బై చెప్పాలని, వాటికి బదులు జ్యూట్, క్లాత్ బ్యాగులు వాడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం వెల్లడించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాత్ బ్యాగ్ లను కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కాలుష్యం నుంచి మన శ్రీకాకుళం జిల్లాను సంపూర్తిగా విముక్తి కలిగిద్దామని, ప్లాస్టిక్ బయో డిగ్రేడబుల్ కాదని, ప్రకృతిని నాశనం చేస్తుందన్నారు. పశువులు, పక్షులు, జలచరాలు, మన ఆరోగ్యానికి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు హాని కలిగిస్తాయన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకకుండా అవరోధన కలిగిస్తుందని, ప్లాస్టిక్ బ్యాగ్ లు ఉన్న చోట మొక్కలు మొలకెత్తవని చెప్పారు. భూసారం దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాల కోసం ఇవాళే నిర్ణయం తీసుకోవాలన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తామని డీఎస్సీ అభ్యర్థులకు ఫోన్

* ఎమ్మెల్యే శిరీష పేరుతో వసూళ్లు
* కాశీబుగ్గ పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

పలాస, జూన్ 2 (వార్త): ఉపాధ్యాయ పోస్టులు ఇప్పిస్తామని కొందరు ఎమ్మెల్యే గౌతు శిరీష పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు సోమవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు ఫోన్ చేసి ఉపాధ్యాయ పోస్టులు ఇప్పిస్తామని, అందుకు ముందుగా రూ.2100 ఫోన్‌పే ద్వారా చెల్లించాలని చెబుతున్నారని, దీనిపై దర్యాప్తు చేసి వసూళ్లరాయుళ్లపై చర్యలు తీసుకోవాలని సీఐ సూర్యనారాయణకు ఫిర్యాదు కాపీని విఠల్‌రావు అందజేశారు.



## పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు : వైసీపీ నేత బెవర



**సరుబుజ్జిలి, జూన్ 2(వార్త):** పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు ఎందుకు తెస్తున్నారని, ప్రజల అవస్థలు తొలగించాలి కానీ, వారికి ఇబ్బందులు కలిగించడం సబబు కాదని వైసీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు మండిపడ్డారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ వాహనాల ద్వారా పేదలకు ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు చేరాయన్నారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. 9,260 రేషన్ వాహనాలను నిలిపివేయడం వల్ల దాదాపు 20వేల కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని ప్రాధాన్యతగా తీసుకొని, ఇప్పటికే స్థిరపడిన విధానాలను కొనసాగించాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలపై భారం మోపడం తగదని, తక్షణం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# చెరువు గట్టు తవ్వేశారు.. మట్టిని తరలించేశారు!

**-ఓ కాంట్రాక్టర్ నిర్వాకం**

**-ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు**



**సరుబుజ్జిలి, జూన్ 2(వార్త):** సరుబుజ్జిలిలో ఉన్న చెరువు గట్టును తొలగించి మట్టిని అక్రమంగా తరలించకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ మట్టిని ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు చెరువు గట్టుపై వేయగా కాంట్రాక్టర్ ఆ మట్టితో పాటు గట్టును కూడా దౌర్జన్యంగా తవ్వేసి తరలించేస్తున్నాడని వారు ఆరోపించారు. ఈ విషయమై మెట్ట నందిష్ ఫిర్యాదు చేసినా, పట్టించుకోలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని వారు కోరారు.

# 5న పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటుటకు స్థలాలను గుర్తించాలని మున్సిపల్ ఎస్ఈ సుగుణాకరరావును ఆదేశించారు. ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు తక్షణమే మొక్కలు ఏర్పాటు చేసే లొకేషన్స్ పంపాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా అధికారులు, ఎఫ్ఆర్ఓలు రాజశేఖర్ ఏడుకొండలు, డిప్యూటీ రేంజ్ అధికారి వెంకట్, రమణమూర్తి పాల్గొన్నారు.

# జర్నలిస్టుల క్రికెట్ పోటీల్లో కర్నూలుపై సిక్కోలు జట్టు విజయం



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** గుంటూరులో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న అమరా వతి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంటు సోమవారం ఉత్సాహవంతమైన వాతావరణంలో ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం శ్రీకాకుళం టీం.. కర్నూలుపై విజయం సాధించింది. తొలుత కర్నూలు జట్టు 12 ఓవర్లు ముగిసే సరికి ఎనిమిది వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. క్రికెటర్లు మధు 25 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి రాణించాడు. శ్రీకాకుళం బౌలర్లు ఎస్ రాజేష్ 3 వికెట్లు, రాఘవ 3 వికెట్లతో కర్నూలు బ్యాటింగ్ వెన్ను విరిచారు. అనంతరం 59 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీకాకుళం టీం కేవలం 1 వికెట్ మాత్రమే కోల్పోయి 8 ఓవర్లలోనే లక్ష్యాన్ని సాధించింది. మహేష్ 27 పరుగులు, శివ శంకర్ 22 పరుగులతో రాణించారు.

# సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి

**-ఆపదలో ఉన్నవారికి చేదోడుగా నిలబడడమే ఆయన లక్ష్యం**

**-సీఎంఆర్ఎఫ్‌తో ఎంతో మందిని కాపాడుతున్నారు**

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, జూన్ 2(వార్త):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు పంపిణీ చేసి ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలోని తన కార్యాలయ ఆవరణలో నియోజ కవర్గ పరిధిలోని 14 మందికి 8 లక్షల 71 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆమె సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో చర్చించి పరిష్కరించారు. మాకనపల్లిలో రేషన్ షాపు ప్రారంభించి, స్థానికులకు సరుకు పంపిణీ చేశారు. 65ఏళ్లు దాటిన వృద్ధులకు స్వయంగా వారి ఇంటికి వెళ్లి రేషన్ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ 21 వ బ్యాచ్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసిన 20వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ బ్యాచ్‌లో చేరుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 ఏళ్లు నిండిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9441161051, 7382921733 నెంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపోమేనేజర్లు అమరసింహుడు, శర్మ, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, సుమన్, శిక్షకుడు వీఏవీ రావు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు నియామక పత్రాలు

**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాగా పని చేసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్బోధించారు. కోటబొమ్మాళిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు నియామక పత్రాలు అందజేశారు. నందిగాం మండలం మొండిరాయవలసవలస, కాపుతెంబూరు, వల్లభారాయిడుపేట, టెక్కలి మండలం పాత నౌపాడ, శాసనం పంచాయతీకు నూతనంగా ఫీల్డ్ అసిస్టెంట్లు నియమితులయ్యారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## 51 వినతుల స్వీకరణ



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి శ్రద్ధ వహించాలని పోలీస్ అధికారులకు అదనపు ఎస్పీ కేవీ రమణ ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో 51 మంది ఫిర్యాదిదారుల వినతులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి, పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## ‘ఒంటరి మహిళకు’ ఎస్ఐ ప్రవల్లిక అండ

**- నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్న వైనం**



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** స్థానిక కంపోస్ట్ కాలనీకి చెందిన ఒంటరి మహిళ గేదెల లక్ష్మికి బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక నిత్యావసర సరుకులను అందించి అండగా నిలిచారు. లక్ష్మి భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు, లక్ష్మి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతూ మంచానికే పరిమితమయ్యారు. దీంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెను మానవ ధర్మంగా భావించి, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను సమకూర్చారు. వీటిని పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అసోసియేట్ నల్ల గౌతమి ద్వారా ఆమెకు అందించారు. దాతలు ఆమెను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ పట్నాయక్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లుగా దరఖాస్తుల ఆహ్వానం



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్లుగా పనిచేయుటకు పదో తరగతి పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకై మీ దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులు ఈ నెల 10 నాటికి సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం డివిజన్ -532001కు రిజిస్టర్డ్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపాలన్నారు. సదరు దరఖాస్తుతో ఆధార్ కార్డు, పాన్ కార్డు ఫొటోస్టాట్ కాపీ జతపరచాలని ఆయన సూచించారు.



## విద్యార్థులకు వివిధ పోటీలు

**మందస, జూన్ 2(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం డస్టర్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మార్పు చక్రధరరావుకు ఘన సన్మానం



**మందస, జూన్ 2(వార్త):** మందస మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన మేథ్స్ ఉపాధ్యాయుడు మార్పు చక్రధరరావుకు ఘన సన్మానం జరిగింది. ఆయనకు సోంపేట మండలం నడుమూరు హెచ్ఎంగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రమణబాబు, సంతోష్ కుమార్ పండా, కొండలరావు, సిబ్బంది, హరిపురం హైస్కూల్ సిబ్బంది సాంబ మూర్తి, బాడ రామారావు, ఈశ్వరరావు, మహేష్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖగేశ్వరరావుకు హెచ్ఎంగా పదోన్నతి



**మందస, జూన్ 2(వార్త):** మందస మండలంలోని కుంటికోట గ్రామానికి చెందిన శిష్టు ఖగేశ్వర రావుకు ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి లభించింది. విశాఖ జిల్లాలోని రాంబిల్లి హైస్కూల్ హెడ్మాస్టర్‌గా విధుల్లో చేరారు. ఆయనకు పదోన్నతిపై కుంటికోట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కుంటికోట సర్పంచ్ దుంపల వైకుంటరావు, గ్రామ పెద్దలు కంచరాన గోపీనాథం, కొర్ల హేమారావు చౌదరి, దుంపల లింగరాజు, గుంట కేశవరావు, చింతాడ శరత్ బాబు, గడ్డవలస భీమారావు, గుంట కోదండరావు, కిల్లి లక్ష్మణరావు, శిష్టు భైరాగి, శిష్టు ఢిల్లేశ్వర రావు, తమ్మినేని కృష్ణారావు, కొర్ల పాపారావు, గుంట లక్ష్మీనారాయణ, దుంపల పోలినాయుడు, తమ్మినేని జయరాం తదితరులు అభినందనలు తెలిపారు.

## రేషన్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

**-టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన**

**మందస, జూన్ 2(వార్త):** రేషన్ సరుకుల వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. బాలిగాంలో రేషన్ దుకాణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన లోపాలను సరిదిద్దడానికే నూతన విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఐదేళ్లుగా రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు, ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**-జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**

**-87 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** పెండింగ్ లో ఉన్న అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో 87 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, సర్వే అండ్ లాండ్ రికార్డులు, మహిళా శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, సర్వ శిక్షా అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఈపీడీసీఎల్, జిజిహెచ్, తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు సత్వరమే సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు. రైస్ కార్డులు పెండింగులో ఉన్నాయని, తగు చర్యలు చేపట్టాలన్నారు. మేరేజ్ సర్టిఫికెట్లు సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని, ఎంపీడీవోలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌లో ముందస్తు ప్రణాళికలతో అధిక దిగుబడులు



**సరుబుజ్జిలి, జూన్ 2(వార్త):** ఆమదాలవలస వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్‌పై సన్నద్ధత కార్యక్రమం రొట్టవలసలో సోమవారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అందజేసే సేవలను, సాంకేతిక పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త జ్యోతిబసు మాట్లాడుతూ రైతులు విత్తనాలు ఎరువులు, నేలసారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవ్వాలని తెలిపారు. ఇతర పంటలను కూడా మంచి యాజమాన్య విధానాల ద్వారా సాగుచేపడితే లాభాలను ఆశించవచ్చన్నారు. రాజమండ్రి శాస్త్రవేత్త శైలజ పంటలలో సమగ్ర యాజమాన్య విధానాలు, వ్యవసాయ పరిశోధన విధానాలను వివరించారు. వరిలో ఆశించే చీడ పీడలను అవగాహన కల్పించారు గ్రామ పెద్ద టి.రాజారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.పద్మనాభం, ఏఈవో రాము, సహాయకులు భగవత్ , మండల వ్యవసాయ అనుబంధ రంగాల సహాయకులు పాల్గొన్నారు.

## ఎండీయూ ఆపరేటర్స్‌పై నిందలు తగదు

**-20 మందికి పైగా ఎండీయూ ఆపరేటర్లు ప్రాణాలు కోల్పోయారు**

**-డీలర్ బెనిఫిట్ సిస్టమ్ .. బాబు విధానం**

**-ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ**



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** తమను దుర్మార్గులు అనడం సీఎం చంద్రబాబుకు తగదని ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. ఎండీయూల ద్వారా ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేయకుండా కాకినాడ పోర్టుకు నేరుగా అక్రమ రవాణా చేస్తున్నామని కాకినాడ ప్రజావేదికలో ముఖ్యమంత్రి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. ఎండీయూ వ్యవస్థను ప్రారంభించినప్పటి నుంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తామే సమస్యలను ఎదు ర్కొంటూ సేవలందిస్తుంటే మంత్రి మనోహర్ కుట్రపూరితంగా తమపై బురదజల్లారని దుయ్యబట్టారు. తాజాగా డీలర్ల ద్వారా బియ్యం పంపిణీలో అక్ర మాలు జరుగుతుంటే ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందని సూర్యనారాయణ విమర్శించారు. బియ్యం పరిమాణం 10 గ్రాములు ఎక్కువ/తక్కువ ఉన్నా ఈ-పాస్ నుంచి బిల్లు రాదని, కచ్చిత మైన పరిమాణంతో బియ్యాన్ని తూకం వేసి ఎండీయూల ద్వారా ఇచ్చామని పేర్కొన్నారు. ఇప్పుడు తూకం మిషన్‌పై ఒక్క బియ్యం గింజను కూడా పెట్టకుండా ఈ-పోస్ మిషన్ ను అనుసంధానం చేయకుండా భారీ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు నగదు బదిలీ పథకం అమలు చేస్తా మని చెబితే ప్రభుత్వం నుంచి వస్తుందని ప్రజలు అనుకున్నారని, కానీ డీలర్లే నేరుగా ఆ డబ్బులు ఇచ్చేస్తారని ఊహించలేదని ఎద్దేవా చేశారు. డైరెక్ట్ బెనిఫిట్ సిస్టమ్ అమలు చేస్తారనుకుంటే.. డీలర్ బెనిఫిట్ సిస్టం తీసుకొచ్చారని మండిపడ్డారు.

## ఉత్సాహంగా జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటలు ఆడాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పి.సుందరరావు అన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీలను సుందరరావు ప్రారంభించి, మాట్లాడారు. 17 ఏళ్లుగా తైక్వాండో , ఉషూ క్రీడలకు చక్కని గుర్తింపు.. గౌరవాన్ని తెచ్చిన తైక్వాండో ప్రధాన కోచ్ కొమర భాస్కరరావు.. రెడ్డి శివకుమార్‌ను అభినందించారు.. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న చిన్నారులకు శుభాశీస్సులు అందించారు. నాలుగు విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి.. ఇందులో విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బీవీ రవిశంకర్, రిమ్స్ ఆస్పత్రి ప్రముఖ ఆర్థో వైద్యులు కారే సంజీవ్, పి.కిరణ్‌కుమార్, తైక్వాండో సహాయ కోచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీల్లో పలు అవార్డులు, రివార్డులు పొందిన చాతుర్యను అతిథులు అభినందించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



## 27న రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం



**శ్రీకాకుళం, జూన్ 2(వార్త):** రెడ్‌క్రాస్ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10.30గంటలకు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ నందు నిర్వహించనున్నామని ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. రెడ్ క్రాస్ సభ్యులు, పేట్రన్లు, వైస్ పేట్రన్లు, కమిటీ సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు. దాతలకు, రక్తదాన శిబిర నిర్వహకులకు, నేత్రదానం చేసిన కుటుంబసభ్యులకు, వలంటీర్లకు పతకాలు, అవార్డులతో సత్కరిస్తామన్నారు.

# ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి

**- మాయమాటలతో అధికారంలోకి వచ్చింది**

**- కూటమి మోసాలను ఎండగట్టేందుకే**

**4న వెన్నుపోటు దినం నిర్వహణ**

**- పార్టీ శ్రేణులు కదలి రావాలి**

**- వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు**

**ఆమదాలవలస, జూన్ 2(వార్త):** మోసపూరిత మాటలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. సోమవారం ఆయన ఆమదాలవలసలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయంలో ఏడాదిలోనే రాష్ట్రంలో అవినీతి , అరాచక పాలనను చూస్తున్నమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ప్రశ్నిస్తూ వెన్నుపోటు దినం కార్యక్రమంతో చంద్రబాబు కళ్లు తెరిపిస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఏడాది గడుస్తున్నా అమలు చేయకపోవడం కూటమి అసమర్థ పాలనను నిదర్శనమని తెలిపారు. హామీలను అమలు చేయకపోగా వాలంటీర్లు తొలగింపు, రేషన్ వాహనాలను తొలగించి ఎంతో మందిని రోడ్డున పడేశారన్నారు. ఆమదాలవలసలో ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైకాపా పార్టీ నాయకులు,



కార్యకర్తలు,అభిమానులు,అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

**ఇచ్ఛాపురం, జూన్ 2(వార్త):** పాఠశాల మధ్యాహ్న భోజన పథకం కుక్, హెల్పర్స్ కు ఒక్క రోజు శిక్షణ ఇచ్ఛాపురంలోని మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. వంట శుచిగా, రుచిగా ఎలా చేయాలో, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో ఎంఈవోలు కురమాన అప్పారావు, విశ్వనాథం, మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, పురుషోత్తపురం హెచ్‌ఎం వెంకటరమణ, ట్రైనింగ్ ఇన్‌చార్జి అప్పలనరసమ్మ, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**సరుబుజ్జిలి, జూన్ 2(వార్త):** సరుబుజ్జిలిలో మండల అధికారులు యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల కార్యాలయం వద్ద కార్యక్రమ బ్యానర్ ప్రదర్శించారు. యోగాతో ఆరోగ్యానికి మంచి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పావని, ఏవో బీవీఎస్ ప్రసాదరావు, ఎంఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్యాలు



**ఇచ్ఛాపురం, జూన్ 2(వార్త):** రైల్వే నార్త్ క్యాబిన్ వద్ద గల చితంబరేశ్వర దేవాలయంలో శివపార్వతుల కళ్యాణం సందర్భంగా వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ స్థాపకులు చిన్నా, నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన క్లాసికల్, కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి. గురువులు కావ్య, శైలు, పూజశ్రీ, శ్వేతారాణి, చిన్నారులు లిఖిత, రమ్యశ్రీ, మధుశ్రీ, సింధు, హారిక చక్కటి హావభావాలతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. మహాగణపతిం, అదివో అల్లదివో, శివతాండవం, శంకర నాదశరీరాపరా, పిడికిట తలంబ్రాలు, వరాహ రూపం, ఐగిరి నందిని చక్కని పాటలు ప్రదర్శించారు. కార్యక్రమంలో చితంబరేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్దలు గొల్ల వీధి గ్రామ పెద్దలు పాల్గొని కళాకారులకు సత్కరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ప్రహరీ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

**పలాస, జూన్ 2 (వార్త) :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో భూముల రేట్లు అంతే వేగంగా పెరగడంతో రోజు రోజుకు భూ తగాదాలు ఎక్కువవుతున్నాయి. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ప్రతి రోజు భూ తాగాదాల ఫిర్యాదులే నమోదవుతున్నాయి. సివిల్ కేసులు వ్యవహారంలో స్థానిక పోలీసులు తలదూర్చకుండా రెవెన్యూ శాఖపై భారం వేస్తున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వరిధి కాశీబుగ్గ డిగ్రీ కళాశాల రోడ్డు హీరో షోరూం ఎదురుగా గత 50ఏళ్లు క్రితం నిర్మించిన ప్రహరీని మదన్ మోహన్ పండా అనే వ్యక్తి కూల్చేశారని తాళాను మన్మధరావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1974-76 లో కాశీబుగ్గ బ్రాహ్మణవీధికి చెందిన త్రినాద్ పండా వద్ద తన తాతయ్య తాళాసు శ్రీరాములు 82 అడుగులు స్థలాన్ని కొనుగోలు చేశారన్నారు. ఆయన మృతి చెందిన తరువాత వారసత్వ ఆస్థిగా ఆ స్థలం తనకు సంక్రమించిందని మన్మధరావు తెలిపారు. ఆ స్థలం చుట్టూ 50 ఏళ్ల క్రితం ప్రహరీని నిర్మించుకున్నామన్నారు. కాగా త్రినాద్ పండా సోదరుదు గణేష్ పండా కుమారుడైన మదన్ మోహన్ పండా 50 ఏళ్ల తరువాత తమ తాత ప్రహరీ స్థలంను అమ్మలేదని చెబుతున్నారన్నారు. ప్రహరీ ఉన్న స్థలం విషయమై ఇరువురు తగాదా పడుతూ వచ్చారు. అయితే తగాదాలకు విసిగిపోయిన మన్మధరావు తనకు ఉన్న దస్త్రాలతో 2008లో కోర్టులో వాజ్యం చేశారు. 2018లో రహదారి, ప్రహరీ స్థలం తనకే చెందుతుందని కోర్టు తుది తీర్పు ఇచ్చినట్లు మన్మధరావుకు విలేకరులకు తెలిపారు. అయితే 2010లో మదన్ మోహన వండా ప్రహరీ నిర్మించిన స్థలం తనకు చెందుతుందని కోర్టులో ఆయన కూడా వాజ్యం వేశారు. అయితే ఈ కేసును కోర్టు త్రోసి పుచ్చినట్లు మన్మదరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల సరస్వతి వురస్కారాలకు కుటుంబంతో మన్మధరావు వెళ్లిన సమయంలో మదన్ మోహన్ పండా ప్రహరీని, నేల బావిని కూల్చివేయడం, బోరును నాశనం చేసిన సమాచారం తెలుసుకున్న మన్మధరావు న్యాయం కోసం ఆన్ లైన్ ద్వారా కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## మఖరజోలలో రేషన్ షాపు ప్రారంభం

**మందస, జూన్ 2(వార్త):** మందస మండలంలోని మఖరజోల గ్రామంలో రేషన్ దుకాణాన్ని పలాస ఎంఎస్‌ఏ గౌతు శిరీషా ప్రారంభించారు. అనంతరం కార్డుదారులకు రేషన్ అందజేశారు. ప్రభుత్వం పునరుద్ధరించిన రేషన్ డీలరు వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో జరుగు తున్న శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్నారు. ఎంఎస్‌ఏ శిరీషాతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక గ్రామపెద్దలు కూడా పాల్గొన్నారు.



## కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు



**శ్రీకాకుళం, జూన్ 2 (వార్త):** పొందూరుకు చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త పతివాడ సింహా చలం ఇటీవల ప్రమాదవ శాత్తు మరణించడంతో జనసేన పార్టీ కేంద్ర కార్యా లయంలో ఎమ్మెల్సీలు కొణి దల నాగబాబు సోమవారం ఆ కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్ర మోహన్, ఆమదాల వలస నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు, మండల అధ్యక్షులు ఎలకల రమణ, జిల్లా కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ అడ్వాన్‌లో సత్తా చాటిన బోరుభద్ర విద్యార్థి వినయ్



**సంతబొమ్మాళి, జూన్ 2 (వార్త):** ఐఐటి అడ్వాన్స్‌లో సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన మణిపాత్రుని వినయ్ కుమార్ సత్తా చాటాడు. వినయ్ ఓపెన్ కేటగిరి లో 9920 ర్యాంక్ ను, ఈ డబ్ల్యూఎస్ కేటగిరి లో 1224 ర్యాంక్ సాధించాడు. వినయ్ విశాఖపట్నం నారాయణ విద్యా సంస్థల పాఠశాల, కళాశాలలలో చదువుకున్నాడు. ఈ విద్యార్థి తండ్రి శ్రీనివాస్ సంతబొమ్మాళి మండలంలో ప్రముఖ దినపత్రిక లో సీనియర్ పాత్రికేయునిగా పనిచేస్తుండగా తల్లి సునీత గృహిణి. వినయ్‌ను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలి

**కొత్తూరు, జూన్ 2 (వార్త):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ పనస రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తూరు మండలం కర్లెమ్మ పంచాయతీ ఆర్ఆర్ కోలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్ క్లయిములు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికలలో కూటమి నేతలు హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 12 నెలలు అవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈసమావేశంలో కార్మిక సంఘం నాయకులు శ్రీను, ఆదినారాయణ, రమణ, రాము పాల్గొన్నారు.




## నేటి నుంచి శాసనేశ్వరిత్రయాన్నిక విగ్రహ ప్రతిష్ఠా మహొత్సవాలు

**ఇచ్ఛాపురం, జూన్ 2(వార్త):** పాతశాసనాంలో నూతనంగా నిర్మించిన శాసనేశ్వరి గ్రామ దేవత త్రయాహ్నిక విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల 3 నుంచి 5వరకు బాల బ్రహ్మానంద సరస్వతీ, మావుడూరు రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరగనున్నాయి. మంగళవారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధన పూజ ధారణ పరిషత్తు పంచగవ్య ప్రాసన రుత్విక్ వరుణ, అంకురారోపణ, యాగసాల ప్రవేశం, అఖండ దీపారాధన, యోగిని, వాస్తు, క్షేత్రపాలక , నవగ్రహ, సర్వతోభద్ర మండపారాధనలు, అగ్ని ప్రతిష్ట, గ్రామ ప్రదక్షిణ, అమ్మవారి ఊరేగింపు, జలాధివాసం, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద పారాయణ ,స్వస్తి . బుధవారం ఉదయం 9 గంటలకు మండపార్చనలు, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, స్నాపనం, మూలమంత్ర సహిత సర్వదేవత హవనములు, మూర్తి హొమం, అంగ హొమం, స్పర్శ హొమం, కళా హొమం, పంచశయ్యాధివాసం, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద పారాయణ, గురువారం ఉదయం 7గంటల నుంచి నవరత్నన్యాసం, గర్తన్యాసం, ఉదయం గం 7 52 నిమిషములకు సుముహూర్త కాలే యంత్రస్థాపనలు, విగ్రహ ప్రతిష్ట ,పూర్ణాహుతి ,జీవకళాన్యాస ప్రాణ ప్రతిష్టాపన జరుగుతాయి. దేవికి మహా పూజ, గ్రామంలో ఉన్న మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546